ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 15-17

# వివిధ రామాయణాలలో కైకేయి వరాలు పొందిన వైనం

డా॥ ఎ.బి. సాయి ప్రసాద్

బెంగళూరు, 560076,

**స్థూల అంశం:** ఏకం సత్ విప్రా బహుధా వదంతి (పురుష సూక్త, ఋగ్వేదం) ని నిరూపించేలా వివిధ రామాయణాలలో కైకేయి వరాలు పొందిన విధానాన్ని తమ తమ దృష్టి కోణాలతో ఆయా కవులు వివరించారు. అన్ని రామాయణాలలోనూ హిందీ మాండలిక మయిన భోజపురిలోనూ వైవిధ్యాన్ని స్పష్టంగా చూడగలము. చాలా మందికి దేవాసురులకు మధ్య జరిగిన యుద్ధంలో ఇంద్రుడికి సహాయంగా వెళ్ళిన దశరథుడి ప్రాణాన్ని కాపాడినందుకు కైకేయి రెండువరాలు పొందిందని తెలుసు. తిమిర ధ్వజుడైన శంబాసురిడితో పోరు సల్పుతున్న సమయంలో, రాత్రివేళ రెండు సార్లు దశరథుడిని కైకేయి కాపాడినట్లు మనకు వాల్మీకి రామాయాణం తెలియజేస్తున్నది. వాల్మీకి ప్రకారం రెండు సార్లు దశరథుడిని కాపాడినందుకు కైకేయి కి సంతృప్తుడైన దశరథుడు రెండు వరాలు ప్రసాదించాడు.

**కీలకపదాలు:** వరాలు, వైనం, రామాయణం, వాల్మీకి, ఋగ్వేదం

**అధ్యాత్మ రామాయణంలో** ఈ సంఘటన మరో విధంగా పేర్కొనబడింది. దేవేంద్రుడు సహాయం కోరగా దశరథుడు రాక్షసులతో భీకరమైన యుద్ధం చేసాడు. ఆ యుద్ధంలో దశరథుడి రథానికి సారథిగా యుద్ధకళా నిపుణురాలైన కైకేయి వ్యవహరించింది. ఒకానొక సందర్భంలో ఇరసులోని చీల విరిగి పడిపోవడం జరిగింది. ఇది గమనించిన కైకేయి తన చేతి వేలును చీలగా ఉంచి రథాన్ని చాక చక్యంతో నడిపి దైత్యులను సంహరిం చేందుకు దశరథునికి సహాయ పడుతుంది. యుద్ధం ముగిసిన తరువాత చీలగా తన వేలును పెట్టిన కైకేయిని దశరథుడు చూచి ఆమె ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని ప్రశంసిస్తూ ఏదైనా వరం కోరుకో అన్నాడు. అధ్యాత్మ రామాయణంలో దశరథుడు ఏదైనా ఒక వరాన్ని కోరుకో అన్నట్లు రాయబడింది. మంథర సలహాను అనుసరించి కైకేయి ఒక వరాన్ని రెండు వరాలుగా కోరుతుంది. కైకేయి వేలు ఇనుప చీలగా ఒక ముని శాపం కారణంగా మారిందని తమిళనాడుకు చెందిన రామాయణ ప్రవచన కారుడు శ్రీ అనంత పద్మనాభాచార్యులు తెలియజేసారు. (రీడీమింగ్ ఎ ప్లఢ్ www. thehindu.com > religion) ఈ చీల కథను బ్రహ్మపురాణం కూడా ఉటంకించింది. మరాఠీ బాషలో సంత్ ఏక్నాథ్ రచించిన భావార్ధ రామాయణం లోకూడా ఈ ప్రస్తావన ఉంది. ఇక్కడొక కొత్తవిషయం ఉంది. యుద్ధం సంబాసురడికి దరథుడికి మధ్య కాకుండా ఇంద్రుడికి దశరథుడికి మధ్య జరుగుతుంది. ఉత్తర భారతదేశంలో లభిస్తున్న ఒక వాల్మీకి రామాయణ ప్రతి ప్రకారం తన మంత్ర విద్యలతో దశరథుడి గాయాలని మాన్పింప జేసినందుకు దశరథుడి ద్వారా వరాన్ని పొందిందని రాయబడి ఉంది. పైన పేర్కొన్న వాల్మీకి రామాయణ ప్రతిని బెంగాల్ రామాయణ కవి కృత్తివాసుడు యథాతథంగా అనుసరించాడు. సంబరుడితో జరిగిన యుద్ధంలో దశరథుడు క్షతగాత్రుడవుతాడు. అస్త్ర సంజీవినీ విద్యలో పారంగతురాలైన కైకేయి మంత్రజలంతో దశరథుని గాయాలను మున్పింపజేస్తుంది. గాయాలు మానిని తరువాత దశరథుడు కైకేయిని ఏదైనా ఒక వరం కోరుకో అన్నాడు.

ఇంకోసారి గోరుచుట్టుతో దశరథుడు బాధపడుతుంటాడు. వైద్యం చేయడానికి ధన్వంతరి కొడుకు పద్మాకరుడొచ్చి గోరుచుట్టును పరీక్షిస్తాడు. పద్మాకరుడు బాధ నివారణకు రెండు ఉపాయాలను సూచిస్తాడు. మొదటి ఉపాయం, అసహ్యంచు కోకుండా నత్తల రసాన్ని తాగడం. ఒకవేళ యిది వద్దనుకుంటే రెండో ఉపాయంను అనుసరించాల్సి ఉంటుందని చెబుతాడు. ఆ ఉపాయం ప్రకారం

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 15-17

ఎవరైనా చీము నెత్తురుతో కూడాకున్న ఆవేలును నోటితో చీకితే గోరు చుట్టు నయమవుతుంది. ఈ ప్రయోగానికి ఎవరూ ముందుకురారు. తన భర్తను అమితంగా ప్రేమించే కైకేయి తనభర్త బాధా నివృత్తి కోసం, "నేను గాయాన్ని చీకుతాను" అని చెప్పడం మాత్రం కాకుండా నిజంగా చీకుతుంది. గోరు చుట్టు నయమవుతుంది. సంతోషం పట్టలేక దశరథుడు కైకకు రెండవ వరం ప్రసాదిస్తాడు.

**గోన బుద్ధారెడ్డి** తెలుగు రంగనాథ రామాయణంలో ఒక వరం పొందిన విధానాన్ని ఇంకో విధంగా వివరించాడు. సంబురుడు మాయావి అని కైకేయి తెలుసుకుంటుంది. అతడి నూరు మాయలను దశరథుడు ఎదురించడంలో కృతకృత్యుడు కాలేకపోతాడు. ఆ విషయం తెలుసుకొని దశరథుడికి సహాయంగా యుద్ధ భూమికి వచ్చిన కైకేయి తనకు తెలిసిన మాయా విద్యలను సంబురుడిపై ప్రయోగించి దశరథుడికి సహాయం చేస్తుంది. కైకేయితో మంథర ఆడిన మాటలను గమనించండి:

బోరాడ దశరథ భూపాలుమీఁద- నా రాక్షసుఁడు మాయ లలుకఁ బన్నుటయు
ధవళాంగుఁ డనుమునిదయ నీవుగన్న – నవిరళం బగుమాయ నామాయ లడఁచి
నీవిభు నాదైత్య నిశితాస్త్రనిహతిఁ - జావకుండఁగఁ గాచి సంత్రుఁ జేసి
వసుధేశుచే రెండువరములు నాఁడు -మసలక వడసితి మరచవే దాని?
(అయోధ్యాకాండ 160-170 ద్విపదల మధ్య, పుట : 88 )

**సంఘదాసుడను జైనకవి** "వసుదేవహిండి" అనే గ్రంథాన్ని రచించాడు. ఇతడు 5వ శబ్దానికి చెందిన కవి. గుణాఢ్యుడి బృహత్ కథ ఆధారంగా తన గ్రంథాన్ని మహారాష్ట్రీ ప్రాకృతంలో రచించాడు. ఇందులో కైక తన కామ కళా నైపుణ్యంతో దశరథుడిని మెప్పించ నందుకు మొదటి వరాన్ని పొందుతుంది. రెండవ వరము తమ రాజ్యపు సరిహద్దు ఆవల ఉన్న రాజును యుద్ధంలో ఓడించినందుకు పొందుతుంది.

జానపదులు రామాయణ భాగవతాల లోని వివిధ సంఘటనలను తమ జీవన శైలికి అనుగుణంగా మార్చుకొని పాటల రూపంలో పాడుకుంటారు. ఇప్పుడు చాలావరకు పాటలు లిపి బద్ధమయినాయి. పూర్వం పెద్దల నుండి విని వాటిని పాడుకొనేవారు. లక్ష్మణుడి నవ్వు, ఊర్మిళ నిద్ర లాంటివి ఆ కోవకు చెందినవే. భోజిపురి మాండలికంలో కైకేయి వరాలు పొందిన వైనాన్ని పల్లెలలో జనం పెండ్లి సమయంలో పాడుతుంటారు. ఇందులో దశరథుడు మహారాజు కాదు. అతడొక పెద్ద జమిందారు. ఆ పాట :

బనసవా కట్‌వన్ చలే లే రాజా దశరథ్
అంగురి గరేలే ఖప్ చాలయి
ధవ్వా తీహున్ నౌవా రే
ధవ్వా తేహున్ బరియా
కైకేయీ కె ఖబర్ జనావ్వా రే
అయిలీ కేకేయియా రాణీ పలంగ్ ఛడీ
బైఠాలీ, ధాయిలీ
అంగురియా కే పోర్ రే
జబ్ రే కేకైయియా రాణీ అంగురీ పోర్
ధాయిలీ రాజా సాయిలే నీర్ భేద యీ
మాంగూ మాంగూ కేకయీ రే అసబర
మాంగు హిరదామే సమేయి.

ధవ్వా=పరుగిడు, నౌవా (నాయి బ్రాహ్మణుడు.
బైఠాలీ = కూర్చింది.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 15-17

పోర్ = పుండు.
ధాయిలీ = అందుకుంది.

వెదురు కోసేందుకు దశరథుడు బయలు దేరాడు. వెదురుకోస్తున్న సమయంలో చేతికి పేడు గుచ్చుకుంది. తన వెంట వచ్చిన నాయీ బ్రాహ్మణుడిని పిలిచి, నీవు యిప్పుడే పరుగెడుతూ పోయి నా చిన్నరాణి కైకేయిని పిలుచుకొని రమ్మని ఆదేశించాడు. సమాచారం అందుకొని కైకేయి దశరథుడివద్దకొచ్చింది. దశరథుడు పడుకున్న మంచంపై కూర్చొని పేడు ఉన్న వేలును అందుకుంది. కైకేయి స్పర్శ కారణంగా దశరథుడి కి ఉపశాంతి కలిగింది. బాధతగ్గి ఊరట కలిగింది. సంతోషంతో కైకేయిని వరము కోరుకో అన్నాడు. అధ్యాత్మ రామాయణంలో లాగానే ఏదైనా ఒక వరం కోరుకో అన్నాడు. అప్పటికి రామ, భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు పెద్దవారయి ఉంటారు. వెంటనే కైకేయి తనకివ్వబడిన వరాన్ని రెండు భాగాలుగా విభజించుకొని మొదట భరతుడి పట్టాభిషేకాన్ని, ఆ తరువాత రాముడి వనవాసాన్ని కోరుతుంది. కైకేయి రాముడి వనవాసాన్ని కోరుకోవడం విని దశరథుడు తన హృదయాన్ని చేతితో పిండుతున్నట్లు బాధపడతాడు. భోజపురీ జానపదుల ఈ పాటలోనే కైకేయి దశరథుడు కోరిన వెంటనే వరాన్ని పొందినట్లు చిత్రీకరించబడింది. రణరంగంలోనే దశరథుడు వరాలనిచ్చినట్లు ప్రస్తుతం నాకేమీ వద్దు. సమయం వచ్చినప్పుడు నేను కోరుకుంటానని చెప్పినట్లే అందరు రామాయణ కవులు రాసారు. అసలు కైకేయి ఈ వరాల సంగతి పూర్తిగా మరిచి పోతుంది. మంథర గుర్తు చేసినప్పుడే కైకేయికి గుర్తు వస్తుంది. ఈ జానపద గేయంలో కైకేయి ఒక క్రూరురాలుగా చిత్రించబడింది. ఇటువంటి పాటను భోజ్‌పురీను మాట్లాడేవారు పెండ్లిలాంటి శుభకార్యంలో ఎందుకు పాడుతారో అర్థం కావడం లేదని రామకథను వివిధ రామాయణాలను, పరిశోధించి అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి రామ్ కథా పేరుతో సిద్ధాంత గ్రంథం రాసి పిహెచ్.డి., పట్టాను పొందిన ఫాదర్ కామిల్ బుల్కే (Fr. Camille Bulke) భావిస్తున్నారు. చీలగా తనవేలును పెట్టినందుకు దశరథుడు రెండు వరాలు కైకేయికి ప్రసాదించాడని కొందరు రామాయణకవులు రాయగా, బ్రహ్మ పురాణంలో మాత్రం దరరథుడు కైకేయికి మూడువరాలు ఇచ్చినట్లుంది.

**ముగింపు:** రామాయణం కథ ఒకటే. అన్ని రామాయణాలలో పాత్రల పేరు ఒక్కటే. కైకేయికి దశరథుడు, అది సందర్భం ఏమైనా కానివ్వండి వరాలు యిచ్చిన మాట వాస్తవమే. కానీ చెయి తిరిగిన పాత్రికేయుడిలాగా ఆ వాస్తవాన్ని తమదైన శైలితో వివిధ రామాయణ కవులు పాఠకుల ముందుంచారు. ఇదే భిన్నత్వంలోని ఏకత్వం.

**ఆధారాలు :**

1.మలయ వాసిని, వివిధ భారతీయ భాషలలో రామాయణ, శ్రీపతి ప్రెస్, కాకినాడ, 1998.
2.వాల్మీకి రామాయణం, శ్రీనివాస శిరోమణి త్రివేటి పబ్లిషర్స్, మచిలీపట్నం, 20వ ముద్రణ.
3.అధ్యాత్మ రామాయణం, గీతా ప్రెస్ , గోరఖ్ పుర్, 9వ ముద్రణ.
4.రామ్ కథా, ఫాదర్ కామిల్ బుల్కే హిందీ పరిషద్ ప్రకాశన్ ISBN 978-93-86863-91-1.
5.కైకేయి: రామ్ కే మాంగీలా బనవాస్. సత్య చైతన్య. Boloji.com